# కన్నతల్లి

తెల్లవారుతుందనడానికి సూచనగా కోడికూసింది. కుక్కి మంచంలో బొంతవేసుకుని ముసుగుతన్ని పడుకున్న యాదవ్వ రగ్గుతీసి బయటకు తేరపార జూసింది. ఇంకా చీకటిగానే ఉంది. మూల్గుతూ అటుపక్క నుండి ఇటు పక్కకు తిరిగింది. కుక్కి మంచం కూడా ఆమెతో పాటే కిర్రుమని మూల్గింది.

రెప్పల్ను టపటప కొట్టుకుంటూ గంపలో కమ్మిన కోడి మరోసారి కూసింది. తెల్లారి పోతుంటే వీల్లింకా లెవ్వర్తేందీ...? అనుకుంటూ కొడుకును పిలిచింది యాదవ్వ.

"నారీ...ఓరి నారాయణా....ఇంకా లెవ్వరేందిరా అంబటాల్లదాకా పంటార్రా. కాపుదనపోడంటే పొద్దుకరకర పొడిచే వారకు చేన్లుండాలె. లేచి ఎడ్లకు గడ్డేసుకో. బంగారమోలె దున్న పోతుల్ని అమ్మి ఉరుకులాడుకుంట ఎడ్లను తెత్తివి. ఎకురం చేనుదున్నకముందే వాటికి మెత్తగాల్లువడె. ఏం ఎవుసమో ఏమో నాకు సమజైతలేదు....అంటూ కోడల్ని కూడా లేపింది...."నువ్వ గూడా లెవ్వేపిల్లా. ఇయాల్ల మంగలారం. వాకిలి సానుపు. లేచి మొలుకమండెకు నీల్లుపొయ్యి. ఇత్తునాలు పొడుగాను. ఈసలికి అసలే మొలకెత్తలేదు. ఎల్లుండే అలుకుడు."

తల్లిమాటలు వినిపించినా వినబడనట్టే ముడుచుకుని పడుకున్నాడు నారాయణ. కోడలు పోచవ్వ మాత్రం లేచి ఇంటిపనుల్లో మునిగిపోయింది.

మరో పావుగంట గడిచిపోయింది. కోడి మరోరెండు మూడుసార్లు కూసింది. కొడుకు ఇంకా నిద్రలేవకపోవడంతో యాదవ్వలో అసహనం పెరిగిపోయింది. ఆమె అసహనానికి ఇదొక్కటే కారణం కాదు. ఎప్పుడూ కష్టపడి పనిచేసే నారాయణ ఈ మధ్య పని సరిగా చేయడం లేదు. మాటిమాటికి విసుక్కుంటున్నాడు.

తల్లి వద్దని చెప్పినా వినకుండా పాలిచ్చే బర్రెను అమ్మాడు. తల్లికి చెప్పకుండానే ఎకరం చేనును కౌలుకు ఇచ్చాడు. ఇంతకు ముందెన్నడూ తల్లిమాటకు ఎదురు చెప్పనివాడు. ఇప్పుడు ఇలా చేయడం ఆమె జీర్ణించుకోలేకపోతుంది.

ఇద్దరు పిల్లల తండ్రి అయినా ఇప్పటివరకూ నారాయణ తల్లి చాటుకొడుకే. బనీన్లు, దోతులు, చెడ్డీలు, బీడీకట్టలు వగైరా వస్తువులన్నీ అతడి అవసరాన్ని గుర్తించి తల్లే కొనితెచ్చేది. కరంట్ బిల్, తహసీలు, ఇంటిపన్ను మొదలైనవి కట్టాలన్నా యాదవ్వనే వెళ్ళికట్టేది. సావుకారి దగ్గర పంట అమ్మిన లెక్కలు నిత్యావసర సరుకుల ఖాతా కూడా యాదవ్వనే చూసేది.

"నారీ...లెవ్వు బిడ్డా. తెల్లారిపోయింది. లేచి ఎడ్లకు గడ్డివెయ్యి. పొద్దంతా దున్నెటివాయె. పొదుగల ఇంత గడ్డిమేత్తెనే గదా వాటికి ఆసర ఉండేది. అవ్వీటిది గూడా మనలెక్క పాణమే. గడ్డివెయ్యకపోతే బేజేలిపోతయి." కోపంగా మరోసారి కొడుకును పిలిచింది యాదవ్వ. ఆమె కంఠంలోని తీవ్రతకు కాస్త భయపడినా మొండిగా సమాధానం చెప్పాడు నారాయణ.

"నాకు చాతనైతలేదు. నీ ఎడ్లు వద్దు ఎవుసం వద్దు. ఈ దిక్కుమల్లె పని నేను చెయ్య. ఎవ్వనికన్నా అమ్ముకో. లేకుంటే జీతగాన్ని పెట్టి ఎల్లదీసుకో. ఇగనన్ను ఒర్రియ్యకు నువ్వొర్రకు."

నారాయణ అంతమొండిగా చెప్పడం చూసి ఆశ్చర్యపోయింది యాదవ్వ. ఆమె గుండెల్లో గుబులు మొదలయింది. కొడుకు అలా ఎందుకు మారిపోయాడో అర్థం కావడం లేదు. ఆమెకు తెలిసినంతవరకు నారాయణకు ఎలాంటి చెడు అలవాట్లు కూడా లేవు. కల్లు కూడా తాగేవాడు కాదు. తన బలవంతం మీదనే కల్లు తాగుడు నేర్చుకున్నాడు.

"వీడు గిట్ల వంగలేని తనం ఎందుకు నేర్చుకున్నాడు. ఓర్వలేక ఎవడన్న ఏదన్న పుల్లపెట్టెనా ఏంది...! ఎల్లమ్మ మొక్కు దుర్గమ్మ మొక్కు పోయినేడే చెల్లిస్తిని. చెప్పుడు మాటలు వట్టిండు గాడిది కొడుకు. వీడు ఎట్లదారికి రావాలే!" గొణుక్కుంటూ ఆలోచనల్లో పడిపోయింది యాదవ్వ.

తలుపు చప్పుడు విని లేచికూర్చుంటూ "ఎవలుండ్లా....పొద్దుగల్ల పొద్దుగల్లనే బిందెలు పట్టుకొని వత్తరు. బాయికాడ మాకు మెసులరాకుంట జేత్తరు. మాపనంత తీరినంక చేదుకపోండ్రి." అంటూ కొడుకు మీది కోపంతో గద్దించింది యాదవ్వ.

ఆ ఊరిలో ఎన్నో బాయిలున్నా మంచి నీల్ల బాయిలు రెండే. అందులో ఒకటి యాదవ్వది. ఆ బాయిల నీల్లుతాగితే గాని దూప అరదంటారు ఆ వాడలో ఉండేవారు. దానికితోడు యాదవ్వ కలుపుగోలు మనిషి. అందుకే అందరు అదే బాయిల నుండి మంచినీల్లు తీసుకుపోతారు. ఏదైనా కొట్లాట పెట్టుకుని మాటలు బందుచేసినా మంచినీల్ల కొరకైనా యాదవ్వతో మాటలు కలుపుకుంటారు.

"నేను నర్సింలును యాదవ్వా నారన్న ఉన్నడా. జెరమాట్లాడేది ఉంది తలుపు తియ్యి." బయట నర్సింలు మాటలు వినిపించాయి. యాదవ్వకంటే ముందుగా వెళ్ళి తలుపు తెరిచింది కోడలు పోచవ్వ.

"ఏంది బిడ్డా నర్సింలు...నిన్న పొద్దుగూకి మా నాయనతో నారన్న ఏదో అన్నడట. నిన్ను అడిగినంకనే లెక్క అని మానాయన అన్నడట. మరి ఆ ముచ్చట నీకు ఎరుకేనా లేదా తెలుసుకుందామని వచ్చిన" గచ్చు అంచుకు గొంగడి వేసుకుని కూర్చుని, బీడి ముట్టించుకుంటూ అన్నాడు నర్సింలు.

యాదవ్వ మనసు ఏదో కీడును శంకిస్తుంది. దిగులు మొదలయింది. పైకిమాత్రం గంభీరంగా విషయాన్ని ఆరా తీస్తున్నట్లుగా అడిగింది.

"ఏది బిడ్డా...ఏం ముచ్చటరా...ఏమన్నా బాకీగిట్ల అడిగిండా ఏంది...? ఈ నడుమ వాడు లంగల సోపతి పట్టిబజార్లు తిరుగమరిగిండు."

"యాదవ్వ మాటలు నర్సింలుకు సూటిగా తగిలాయి. ఆమె తనను ఉద్దేశించి అన్నదే అని అతడికి తెలుసు. అతడు అలా తెలుసుకోవాలనే ఆమె ఆ మాటలు అన్నది. ఏం మాట్లాడాలో తోచక మౌనంగా ఉండిపోయాడు నర్సింలు. ఇల్లు ఊడ్చుకుంటూ వస్తున్న పోచవ్వ నర్సింలు వద్దకు వచ్చి ఆగి "గట్ల అరుగంచుమీద కూచున్నవేందే...కుర్చీమీద కూసో" అంటూ తనపనిలో మునిగిపోయింది.

"యాడకూసుంటేంది గని" విసురుగా అంటూ లేచి మీదకూచున్నాడు నర్సింలు. నారాయణ లేచి వచ్చి నర్సింలు పక్కన మౌనంగా కూర్చున్నాడు.

"ఇప్పుడు చేను అమ్ముతనని మా నాయినతోని నారన్న అన్నడట. అటు తరువాయి మాచేనే ఉంది కదా. అవ్వను గట్టిగ తెలుసుకుని చెప్పు అని మా నాయన అన్నడట. రేపు నర్సింలును రమ్మను మాట్లాడుదాం అని నారన్న అన్నడట. నేను సిరిసిల్లకు పోయి రాత్రి బసుకు వచ్చిన మా బామ్మర్దిలగ్గం. ఇయ్యాల్లకూడా పోతున్న. నిన్ను కల్సి పోదామని వచ్చిన." వచ్చిన విషయం చెప్పాడు నర్సింలు.

ఆ మాటలకు యాదవ్వ గుండెలో రాయిపడ్డట్టయింది. కొన్ని క్షణాలు నోటమాట రాక అలాగే ఉండిపోయింది. ఇప్పట్లో ఉన్నది రెండెకరాల చేను. అది అమ్మితే మిగిలేది గుట్టకింద అద్దెకురం పొలం మాత్రమే. అది అమ్మాల్సిన అవసరం ఎందుకు వచ్చిందో ఆమెకు అర్థం కాలేదు. కొడుకు మీద చెప్పలేని కోపం వచ్చింది.

"అవురా నారిగా...చేను అమ్ముతనన్నావా...చేనమ్మి గాడిది పండ్లుతోముతననుకున్నవా నీకు ఏం తక్లీబువచ్చిందని చేను అమ్మతనన్నవు. నీకు పిచ్చిగిట్ల లేసిందా ఏందిరా?" గయ్యిమని లేచింది యాదవ్వ.

ఉలుకూ పలుకూ లేకుండా మౌనంగా ఉండిపోయాడు నారాయణ. పోచవ్వ తనపని తాను చేసుకుంటూ వారి సంభాషణను జాగ్రత్తగా వింటుంది. వారందరూ మౌనంగా ఉండడంతో తనే చెప్పడం ప్రారంభించాడు నర్సింలు.

"ఇంక నీకు తెల్వదా యాదవ్వా? నారన్న దుబాయ్ పోతడట. ఎముడాల ఏజెంట్ యాదగిరి దగ్గర పాస్‌పోటు పెట్టిండు. మనూరు మనుషుల్ని ఇంతకుముందే యాదగిరి మస్కట్ తోలియ్యలేదా...? ఇది గప్పటిముచ్చట. మొన్న వచ్చి నారన్నకు విజా వచ్చిందని చెప్పిండు. రంజాన్ తెల్లారి పోవాలె. పైసలు జమచేసుకొమ్మని చెప్పిండు."

అసలు విషయం అప్పుడు అర్థమైంది యాదవ్వకు. దుఃఖంతోపాటు కోపం కూడా ముంచు కొచ్చింది. గొంతు బొంగురుగా మారింది. కళ్ళలో నీల్లు సుడులు తిరిగాయి. కొడుకు చెడిపోతున్నా డన్న బాధ ఆమె హృదయాన్ని కలవరపరుస్తుంది.

"నీకేం పోయేకాలంరా నారిగా...ఎవడు బతుకలేడని దుబాయి పోతనన్నవు. ఇక్కడ పని చెయ్యశాతగాక ఇదో ఏశం పెట్టుకున్నావు. దుబాయి లేదు గిబాయి లేదు. వారీ నర్సింలు. దగ్గరి మాట బిడ్డా. వాడు గిట్లనే నరుకుతడు. చేనమ్మము చెల్కలమ్మము. వాని మాటలు పట్టుకుని మీరు పరేషాన్ గాకుండ్రి. నన్ను పరేషాన్ చెయ్యకుండ్రి యాడికిపోతడో పోని." విసురుగా అన్నది యాదవ్వ ఆమె గొంతులో దుఃఖం మిలితమై గొంతుకీచుగా వినిపించింది.

ఆమె మాటలకు విసురుగా లేచాడు నర్సింలు. గొంగడి దులిపి కొప్పెరపెట్టుకున్నాడు. మీసాలను ఒకసారి సవరించుకుని సరాయించి ఉమ్మివేసాడు.

"నారన్న అన్నడుగదా అని నేను అంటున్న. నీచేను గౌనాలన్నయావ మాకులేదు. మాకు పైసలు పుచ్చిపట్టి పోతలెవ్వు. నీకు ఇష్టమైతేనే సరి. ఏదో పక్కనే ఉందిగదా పనికత్తదని అనుకున్నం" అంటూ బయటకు వెళ్ళిపోయాడు నర్సింలు కోపంగా."

నర్సింలు ముందు అలా అన్నందుకు నారాయణకు కోపం వచ్చింది. మళ్ళీ కలిసినప్పుడు నర్సింలు మాట్లాడే ఎత్తిపొడుపు మాటలు ఊహించుకుని అతడి హృదయం మండిపోయింది. ఆ కోపాన్ని తల్లిమీద చూపించాడు.

"ఇంటికచ్చిన బ్యారాన్ని జారగొడితివి. ఇప్పుడు కొనడానికి ఎవడు వస్తడు నువ్వేదైనా గిట్లనే చేత్తవు. పందిరి మీది గుండోలె పటుక్కుమని నోరు జారుతవు. నీరెండకరాల చేను అమ్మితే కోట్లు వత్తయనుకుంటున్నావా...? మహా అయితే తొంభైవేయిలు. అదీ నర్సిమ్మడు కొంటేనే. మిగతా ఎవ్వడైనా సరుదుకు లేదని ఎనుబైవెయిలు పెట్టడు." అంటూ తల్లి సమాధానం కొరకు ఎదరుచూడకుండా బయటకు వెళ్ళిపోయాడు.

ఆ రోజు ఇంట్లో ఎవ్వరూ భోజనం చేయలేదు. యాదవ్వ మొగుడిని తలుచుకుని ఏడ్పులు మొదలుపెట్టింది. ఆమెను ఊరడించడానికి వచ్చిన ఇరుగుపొరుగువారు ఎవరికి నచ్చిన రీతిలో వారు మాట్లాడారు. కొందరు దుబాయి పోవెడెందుకన్నారు. మరి కొందరు ఎంత మంది పోతలేరు రెండేండ్లు పోని తియ్యి అన్నారు. వదిస మరదలు వరుసైన మరికొందరు పోచవ్వ ముందే "నల్లిపొరి. మొగనికి ఏమని అంటిచ్చిందో ఏమో. లగ్గంగాక ముందు గింత అద్దుమానం లేకుండె" అన్నారు. పోచవ్వ మౌనంగా ఉండిపోయింది.

యాదవ్వకు ఇప్పల్ల చేను ఎలా సంపాదించింది గుర్తుకు వస్తున్నది. నారాయణ రెండేండ్ల పిల్లగానప్పుడే భర్త చనిపోయాడు. మనిషి అజానుబాహుడు. రెక్కలిరుగ కష్టం చేసేవాడు. మీసాలు పెద్దగా ఉండేవి. మంత్రాలు వస్తాయని అందరూ భయపడేవారు. రాత్రి మక్కకావలి పోయాడు. తెల్లవారేసరికి శవమై మోటబాయిలో తేలాడు.

అతడు ఎలా చచ్చాడో ఎవరికీ తెలియదు. దొర కొడుక్కు మంత్రం చేసి చంపాడని, అందుకే దొర ఒక ప్లాన్ ప్రకారం పాలేర్లతో చంపించాడని అనుకుంటారు. అప్పుడు యాదవ్వ తల్లిగారింటి వద్దఉన్నది. విషయం తెలియగానే సొమ్మసిల్లి పడిపోయింది. భర్త శవం మీదపడి గుండెపగిలేలా ఏడ్చింది. కొన్నాళ్ళు పుట్టింట్లో ఉన్నా అన్నా వదినలతో పడక తన ఇంటికి తాను వచ్చేసింది. భర్త చనిపోయేటప్పుడు ఆమెకు మిగిలిన ఆస్తి కోట కింద అర ఎకరం పొలం. ఆ పొలాన్ని అమ్మినా తేరని అప్పు.

చేనును అమ్మి అప్పు కట్టమని ఎంతో మంది ఉచిత సలహా ఇచ్చారు. అప్పులవారయితే ఎంతో ఇబ్బంది చేసారు. యాదవ్వ చేను అమ్మలేదు. రెక్కల్ని నమ్ముకుంది. తన చేను నాటువేసుకున్నాక కూలిపనికి వెళ్లేది. చేనునాటుకు వచ్చిన వాల్లకు బదలు వెళ్ళేది. వరినాట్లమీద ఎకరాలకెకరాలు గుత్తలు పట్టేది. బాయిల పూడికలు తీసుడు చెరుకువాడె తీసుడు గుత్తలు పట్టింది. ఇద్దరు ముగ్గురు కైకిలోల్లను పెట్టుకొనేది. వారికంటె ఒక అడుగు ముందు ఉండి పని తొందరగా చేత్తలేరని గదరాయించేది. అలా ఇద్దరితో నలుగురి పనిచేయించేది. తను ఒక్కతే ఇద్దరి పనిచేసేది. పొద్దుపొడవక ముందే గుత్తపనికి వెళ్ళేది. చీకటిపడితేకాని ఇంటిక చేరేది కాదు. తన కైకిలిపోను గుత్తల్లో కొంతసొమ్మును లాభంగా సంపాదించేది.

రెండేండ్లు తిరక్కముందే బాకీలన్ని మిత్తితో సహా తీర్చేసి అందరి మెప్పును పొందింది. అన్నా, తమ్మీ అంటూ వరుసలు కలుపుకుని అందరిలో మంచిపేరు తెచ్చుకుంది.

ఇలా యాదవ్వ అభివృద్ధి పాలివాళ్ళకుచురకలాతగిలింది. వారిలో ఓర్వలేని తనం మొదలయింది. మొగతోడు లేదని పొలంగట్టు దగ్గర, కాలువ దగ్గర కావాలని ఏదో కయ్యం చేసేవారు. యాదవ్వ మాత్రం బయపడేదికాదు. గాయికెత్తుకునేది. ఆడోళ్ళను మొగోళ్ళను కలిపితిట్టేది. తను ఏమాత్రం వెనుకడుగువేసినా తనని అక్కడ నెగులనియ్యరని ఆమెకు తెలుసు. ఆమె నోటి దురుసుతనానికి భయపడి తోకముడిచేవారు.

ఆమె పొలం వద్దలేనప్పుడు మాత్రం ఒడ్లకు గండ్లు పెట్టేవారు. రాత్రిపూట కాలువనీల్లన్నీ మర్రగట్టి యాదవ్వ పొలంలోకి వదిలేవారు. నీటి ప్రవాహానికి నారు కొట్టుకుపోయేది. యాసంగి నీల్లులేక మక్కఏత్తే కంకులు ఇరుసుకుపోయేవారు. గడ్డివామును కాలవెట్టారు. ఒక్కసారైతె రాత్రికిరాత్రి చేనులో ఎడ్లను తోలిమేపించారు.

రోజురోజుకు పెరుగుతున్న పాలివాళ్ళ బాధలను చూసి కలవరపడిపోయినా, మొండి ధైర్యంతో ముందుకు కదిలివారితో పోరాడింది యాదవ్వ. చేనును మేపింద్రని సంగంలో పంచాది పెట్టించింది. చూసిన గవాయిలు లేకపోవడం వల్ల పంచాది నిలువలేదు. చేను మేపింది మేము కాదని వాదించారు పాలివాళ్ళు. గవాయిని తెమ్మన్నారు. సంగం పెద్దలు కూడా వారికి సపోటుగా గవాయిలు ఏరన్నారు. గవాయిలు లేకుండా వారిమీద పంచాది పెట్టినందుకు యాదవ్వను తప్పుపట్టారు.

యాదవ్వ సంగాన్నే ఎదిరించింది. మేము చేను మేపించలేదని పోచమ్మ గుడిలో ఇమానం చెయ్యమని సవాల్ విసిరింది. ఆ మాటను కూడా తప్పుపట్టింది సంగం. పాలివాళ్ళకు సంగం పెద్దల అండదొరకడంతో మరింతగా రెచ్చిపోయారు. నాటువేసాక పొలంను ఎడ్లచేత తొక్కించేవారు. నాగండ్లను ఎత్తుకుపోయేవారు. యాదవ్వ తన చేనును పైసలిచ్చిదున్నిపిచ్చేది. ఎవరు దున్నకూడదని హెచ్చరించేవారు.

ఒకసారైతే వరికోసి కుప్పవేసినంక రాత్రిక రాత్రి వరికుప్పకు నిప్పుపెట్టారు. కుప్పకాలి పోవడం చూసి ఎవరో చెబితే గుండె బాదుకుంటూ వెళ్ళింది. యాదవ్వ చేతికచ్చిన పంట కండ్లముందే బూడిద అవుతుంటే కిందపడి ఏడ్చింది. అప్పుడు నారాయణకు పదేండ్ల వయసు. తల్లిని ఎలా ఓదారొచ్చలో తెలియని పసితనం. ఎవరో సలహాఇస్తే దుమాల గుట్టలల్లకుపోయి అన్నలను కలిసింది యాదవ్వ. తన గోడును చెప్పుకుని ఏడ్చింది. అప్పటివరకూ అన్నలంటే ఎవరికీ తెలియదు. దళాలు ఊర్లు తిరిగేవి కావు. అప్పుడప్పుడే మొదలవుతుంది.

అన్నలు ఊరిలోకి వచ్చారు. పాటలు పాడారు. యాదవ్వను పాలివాళ్ళను నలుగురిని పిలిపించారు. తుపాకి చూపించి అడిగితే నిజాన్ని ఒప్పుకున్నారు పాలివాళ్ళు. నష్టపరిహారం ఇస్తామన్నారు. ఇకముందు అలాంటి పని చేయమని యాదవ్వ కాళ్ళుమొక్కారు.

యాదవ్వను ఏమైనా అంటే కాళ్ళు చేతులు నరుకుతమని అన్నలు వార్నింగ్ ఇచ్చి వెళ్ళారు. అనాటి నుండి యాదవ్వను ఎవరూ ఏమీ అనలేదు. కాయకష్టం చేసి అరెకరం పొలంతో మరో రెండెకరాలు ఇప్పల్ల చేనును సంపాదించింది. మేనపిల్లతో నారాయణకు పెళ్ళిచేసింది.

* * *

ఎటువెళ్ళాడో కాని రెండురోజులు ఇంటిముఖం చూడలేదు నారాయణ. ఈ విషయం తెలిసి అతడి మామవచ్చాడు. తండ్రిని చూడగానే గొల్లుమని ఏడ్చింది పోచవ్వ. యాదవ్వకూడా అన్నమీద పడి ఏడ్చింది. ఆవునూరు, గూడెం, కొండపురం, ముస్తాబాద్...ఎక్కడెక్కడ చుట్టాలున్నారో అక్కడక్కడ నారాయణ కొరకు వెదికారు.

చివరకు వేములవాడ ఏజంట్ యాదగిరి దగ్గర ఉన్నట్టు జాడతెలసి అక్కడికి అన్నతో వెళ్ళింది యాదవ్వ. యాదగిరి దూరపు చుట్టం. ఊరికి వచ్చినప్పుడల్లా యాదవ్వను కలవందే వెళ్ళడు.

తల్లిని మామను చూసి మోహం తిప్పుకున్నాడు నారాయణ. వారు ఎంత ఏడ్చినా మారుమాట చెప్పలేదు. ఎటో వెళ్ళిన యాదగిరి సాయంత్రానికి ఇంటికి వచ్చాడు. వాళ్ళను చూసాక గాని అసలు విషయం బోధపడలేదు అతనికి. అంతవరకు ఇంట్లో చెప్పివచ్చాడనుకున్నాడు.

"ఎందిరా యాదిగా...తమ్మున్ని గిట్ల ఆగమాగం తిప్పుతున్నావు. చాతగాక పోతే ఎవుసం తీసెయ్యని. చేన్లు పాలుకియ్యని. లగ్గాని కచ్చిన ఆడిపిల్లలున్నరన్న బాధనా..? జామ పండ్లోలె ఇద్దరుకొడుకులు ఏ అయ్యనన్న కాల్లు మొక్కుకుంట పిల్లను దించి పోతడు. ఈనికి మస్కట్ ఎందుకు దుబాయి ఎందుకు...? వంగి చేసుకుంటే ఇక్కడ బతుకుతెరువు లేదన్న తండ్లాటనా...? యాదగిరిని నిలదీస్తూ అడిగింది యాదవ్వ. యాదగిరి ఏదో చెప్పబోతుండగా నారయణ అందుకున్నాడు.

"గండ్ల యాదన్నదేం తప్పలేదు. నేనే ఆయన ఎంబడవడ. అందరినీ మస్కట్ తోలిత్తున్నావు. నన్నుగూడా తోలియ్యమని పిక్సచేసిన. మా అవ్వ ఏమనకుండా నాజిమ్మదారని చెప్పిన.

నీకేంది నువ్వు గట్లనే అంటవు. ఎన్ని రోజులున్నా మన్నుదిని మన్నుగక్కుడే ! ఎన్నడన్న వైనంగ బట్టగట్టిన్నా వైనంగా కూడుతిన్నావా ! ఎప్పుడు గిదే సాలిసాలని బతుకాయె. ఎంత కట్టపడ్డాలాగోడికి సాలుతలేదు. పంట పండినంక లెక్కసూత్తే నా కైకిలు గూడా పడుతలేదు. ఎవుసంల ఏం లాభం ఉంది. బాలెలయ్య నాకంటే చిన్నోడు. రెండేండ్లు మస్కట్ పోయిండు. మనషి ఎంత నిగనగ అయిండు. లక్షకు పైన సంపాయించిండట. ఇక్కడ ఎన్నేండ్లు కట్టంచేసినా గిట్లనే ఉంటం. ఇగో అవ్వా... నీకు కొడుకు కావాలంటే గాచేను అమ్మి పైసలియ్యి. లేదంటే నీ కొడుకు సచ్చిండనుకో." కట్టె విరిచినట్టుగా చెప్పి మోహం తిప్పుకున్నాడు నారాయణ.

ఆ మాటలకు యాదవ్వ గుండె చెరువయింది. ఎంత నచ్చచెప్పినా అతడు వినడని తెలిసిపోయింది. కొడుకు మీదిప్రేమ దుఃఖంగా మారింది.

"ఓరి కొడుకా... ఒక్క కొడుకువని ఓడిగట్టిసాదుకున్న. కూలీనాలీ చేసి ఉపాసం ఉప్పిడుండి పెద్దచేసిన. నువ్వులేకపోతే నేను బతుకరా..." ఏడుపు అందుకుంది యాదవ్వ. నారాయణకు కోపం ముంచుకొచ్చింది.

"ఏం సావవు తియ్యి, సత్తె టెలిగ్రాం కొడుతారు. అయినా నేనుంటే మాత్రం సచ్చేదాన్ని ఆపుతానా ఏందీ." అన్నాడు.

ఎక్కడ యాదగిరి మనసు మార్చుకుంటాడో అని అతడి బాధ. అందుకే ఎవ్వరినీ ఎక్కువ మాట్లాడనీయడం లేదు. మాటకు మాట కరాకండిగా చెబుతున్నాడు. ఒకటి రెండు మాటలు

మాట్లాడి మౌనంగా ఉండిపోయాడు నారాయణ మామ. అతడికి గూడ మనసులో నారాయణ దుబాయికి వెళ్ళాలనే ఉంది. అదను చూసి చెల్లెల్ని మెప్పించే ప్రయత్నం చేయాలనుకున్నారు. అతికష్టం మీద నారాయణను ఇంటికి రప్పించారు.

పోచవ్వకు కూడా మనసులో భర్త గల్ఫ్ వెళ్ళాలనే ఉంది. కాని ఎవరూ బయటపడడం లేదు. నారాయణ వినడం లేదన్న నెపంతో యాదవ్వను ఒప్పించాలని ప్రయత్నిస్తున్నారు.

"ఏదో తియ్యి అత్తా! అయిన గట్ల మొండికేసుకుని కూసుండే. చెప్పంగ ఇననోల్లను చెడంగ సూడాలంటరు. నీకు ఎంత ఆరాటం ఉంటే ఏం లాభం. అయిన ఇంటలేడుగద." మెల్లిగా నోరు విప్పింది పోచవ్వ. ఆమె మాటలకు గయ్యిమంది యాదవ్వ.

"ఇంట్లకూసుండి నీకేం ఏరుపడుతుందే. గాదేశంగాని దేశంల అయ్యానా అవ్వనా...? కాలు నొచ్చినా జరమచ్చినా ఎవలుదిక్కు. చాతనైన కాడికి కట్టంచేసుకుని కండ్ల ముందు ఉండనీ. శాతగాకపోతే పనిబందు చెయ్యని. నాబాధ నీకు తెల్వదే. కరువుల, కాలంల నాకడుపు మాడ్చుకుని కొడుకును సాదుకున్న. వీడు అమాయకుడు గండు గెలిచినోడు కాదు. రొండేండ్లు ఒక్కడు ఎట్లుంటడే."

ఆ మాటలకు పోచవ్వ "నీకు ఒక్కలకే ఉన్నడు కొడుకు. దేశంల ఎవ్వలకు లేరు పోయేటో ల్లంత ఎట్లపోతుండ్రు." అని మనసులో అనుకుని మౌనంగా ఉండిపోయింది.

రోజులు దగ్గర పడుతున్నాయి. కొడుకుమీది ప్రేమతో యాదవ్వ ఒప్పుకోవడం లేదు. అందరూ ఆమెకే నచ్చచెప్పుతున్నారు. మస్కట్, దుబాయికి వెళ్ళిన ఎందరో వ్యక్తుల గురించి చెబుతున్నారు. ఒప్పుకోకపోతే కొడుకు అగమౌతాడని హెచ్చరించారు. చివరికి తాను ఉరివేసుకుని చచ్చిపోతానని బెదిరించడంతో కాస్తపట్టు సడలించింది యాదవ్వ. తిండి తినడం మానేసింది. ఆమెకు జ్వరం పట్టుకుంది. రెండెకరాల చేను కరెన్సీరూపంలో ఆమె ఇంటిలోకి చేరింది.

రంజాన్ రెండు రోజులుండనగా వచ్చాడు యాదగిరి. యాదవ్వ మంచం పట్టడం చూసి నొచ్చుకున్నాడు. ఆమెకు ధైర్యం చెప్పాడు.

"బిడ్డా యాదగిరి...తమ్మున్ని ఎసొంటిదేశం తొలిత్తాన్నవో. గుంట శిక్కులు తెల్వనోడు. మంచి దేశంతోలు బిడ్డా. నాలుగు రోజులు ఎనుకైనా సరే! ఆదరబాదర చేసి చేతుల దులుపుకోకు. తమ్ముని జిమ్మదారునీదే! తమ్మునికి ఏదైనా అయితే నీ ఇంటి ముంగటచ్చి కూసుంట మూల్గుతూ చెప్పింది యాదవ్వ.

"అవ్వా...నేనుగసొంటోన్ని గాదే. మంచికంపెనికి తోలిత్తన్న. దేశం కూడా మంచిదే. సౌదీ, కువైట్, బైరన్ అయితే జెరంత తక్లీబుంటది. దుబాయిల గట్లగాదు. మన దేశం లెక్కనే ఉంటది. అక్కడ మనోల్లు మస్తుమంది ఉన్నరు" నచ్చచెప్పాడు యాదగిరి.

అమాటా ఈమాటా మాట్లాడాక విషయం పైసల మీదికి మళ్ళింది. తోలినందుకు ఎనభైవేయిలు కావాలని చెప్పాడు యాదగిరి. మెడికల్ ఖర్చు, బొంబాయి దాకా బస్సు కిరాయిలు తనే పెట్టుకుంటనన్నాడు. తనకు అందులో ఏమి మిగలదని, మిగతా దేశాలకైతే దెబ్బయి వేయిలల్ల తొలిత్తనన్నాడు. మిగిలిన వాళ్ళ దగ్గర ఎనుబై అయిదు వెయిలు తీసుకుంటున్ననని ఒట్టు పెట్టుకున్నడు.

జీతం ఓవర్‌టైం కలుపుకుంటే నెలకు జీతం పదివేలు వస్తాయని ఎనిమిది నెలల్లో బాకీ తీర్చవచ్చునని చెప్పాడు. తను ఎవరెవరినీ తోలిచ్చిందీ వాళ్ళు ఎంత సంపాదించిందీ పూసగుచ్చినట్లు చెప్పాడు. అయిష్టంగానే తలూపింది యాదవ్వ.

నారాయణ వెళ్ళే రోజురానే వచ్చింది. బంధువులు, మిత్రులు ఇల్లు నిండారు. పిండివంటలు చేసారు. కల్లుతాగి కూరతో భోజనం చేసారు. నారాయణ అందరివద్ద సెలవు తీసుకుని బయలు దేరాడు. అతడితోపాటు మరో ముగ్గురు వ్యక్తులను తీసుకొని బొంబాయి ప్రయాణమయ్యాడు యాదగిరి. కరీంనగర్ వరకూ వెళ్ళి కొడుకును బొంబాయి బస్సు ఎక్కించింది యాదవ్వ. కొడుకు బస్సు ఎక్కగానే శోకంతో కూలబడిపోయింది.

నెలరోజులు తిరక్కముందే నారాయణ నుండి ఉత్తరం వచ్చింది. కంపెనీ మంచిదని తిండికూడ పెడుతుందని రాశాడు. తల్లిని బెంగపెట్టుకోవద్దని రాశాడు. జీతం మంచిగా ఉందని ఓవర్‌టైం కూడా దొరుకుతుందని రాశాడు. భార్యపేరు మీద బ్యాంకు నెంబరు తీసిపంపుమని రాశాడు.

ఒక్కయాదవ్వ తప్ప అందరూ తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నారు. వ్యవసాయం మూలకుపడింది. తాతలనాటి అరెకరం చేనును కౌలుకు ఇచ్చింది యాదవ్వ. పోచవ్వ ఇద్దరు పిల్లలను తీసుకుని మాటిమాటికి తల్లిగారింటికి వెళుతుంది. బీడీలు చేయడం నేర్చుకొమ్మంటే ఇప్పుడు చేయడం రావని చెప్పింది. క్రమక్రమంగా ఆమె మాటల్లో ఏదో గర్వం చోటుచేసుకోవడం గమనించింది యాదవ్వ.

వ్యవసాయపు పనిముట్లతో సందడిగా ఉండే ఇల్లు ఇప్పుడు బోసిపోయినట్టయింది. ఒక్కొక్క పనిముట్టు అటకనెక్కాయి. పనేం లేకపోవడంతో యాదవ్వకు ఏమి తోచడం లేదు. రోజు రెండుసార్లు చేనువద్దకు వెళ్ళి తిరిగి వస్తుంది.

మూడు నెలలకాలం గడిచింది. చెప్పా చేయకుండా జీపులో వచ్చి ఇంటిముందు దిగాడు నారాయణ. అందరూ ఆశ్చర్యంతో నోరు తెరిచారు రందితో మనిషి కట్టెపుల్లలా తయారయ్యాడు. పోల్చుకోలేనంతగా ఉన్నాడు.

తల్లిమీదపడి బావురుమని ఏడ్చాడు నారాయణ. ఏం జరిగిందో వివరించి చెప్పాక అందరూ సానుభూతిగా చూసారు అతని వైపు. కంపెనీలో పని అయిపోవడం మూలాన అందరినీ వెనక్కి పంపారని అతని మాటల సారాంశం.

పోచవ్వ, ఆమె తండ్రి మిగిలిన బంధువులు, మిత్రులు బెంబేలుపడిపోయారు. వారి ముందు ఏజెంటుకు కట్టిన ఎనభై వేయిల రూపాయలే కదులుతున్నాయి. ఇప్పుడెలా బ్రతకడం అన్నదేవారి ప్రశ్న.

సానుభూతి వాక్యాలు చెప్పి అధైర్యపడి ఏదైనా అఘాయిత్యం చేసుకోవద్దని నారాయణకు హితవు చెప్పారు బంధువులు. చివరి వరకూ ఉండి అందరూ వెళ్ళిపోయాక చెప్పేమాటలు చెప్పి తను కూడా వెళ్ళిపోయాడు నారాయణ మామ. మిగిలింది ముగ్గురు మాత్రమే. కొడుకు, కోడలు, యాదవ్వ.

అవమానంభారంతో ఇంట్లోంచి బయటకు వెళ్ళడం లేదు నారాయణ. ఎలా బ్రతకడం అనే ప్రశ్న అందరికంటే ముందు అతనికే మొదలయింది. తండ్రి చనిపోయే వాడున్న అరెకరం తప్ప మరేంలేదిప్పుడు.

కొడుకు పరిస్థితి గమనించి లేచింది యాదవ్వ. కొడుకు ఏమైపోతాడోనని భయపడింది. తనను తాను సముదాయించుకుంటు కొడుకును సముదాయించింది.

"ఏంది బిడ్డా గట్ల బయపడ్తాన్రా! చేతిమైలపోయింది. పోతేపోనీ మీ నాయన పోయిన్నాడు మనకు ఎంత భూమి ఉండే. బెంగటిల్లితే ఇప్పుడే మన్న వత్తదా! ఎవల్దన్న రెండెకురాలు పాలుకు పట్టుకుందాం. కాల్లు రెక్కలు సల్లగుంటే మల్ల సంపాచించుకుంటం." అంటూ నడుముకు కొంగును చుట్టి నాట్లు, బాయిలు, చెరుకువాడె గుత్తలు పట్టడానికి బయలుదేరింది.

ఎంతో తిడుతుందనుకున్న తల్లి తననే ఓదార్చడం నారాయణను కదిలించింది. వలవలా ఏడ్చాడు. "అవ్వా! నువ్వు చెప్పినట్లు వింటే యిట్లాగాకపోవు". అంటూ కాళ్ళమీదపడ్డాడు నారాయణ.

యాదవ్వ కండ్లల్లో నీళ్ళు తిరిగాయి. కొడుకును గుండెకు హత్తుకుంది.

*(ప్రజాశక్తి దినపత్రిక జులై 1999 కరీంనగర్ జిల్లా కథలు మొదటి సంపుటి 1999)*